పంటల్లో చీడపీడలా.. పరిష్కారాలు తెలుసుకోండి

సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
80080 03433
99896 23830
86399 72799



న్యూస్‌టుడే, కోటగిరి : వానాకాలం వేసిన పంటలు అధిక వర్షాలతో చీడపీడలు, తెగుళ్ల బారిన పడి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. వీటి నుంచి పంటలను రక్షించుకోవడం కర్షకులకు సవాలుగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో అన్నదాతలకు సాయంగా రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో బుధవారం 'ఈనాడు' ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

చక్కెర పరిశ్రమ తెరిపించేందుకు కృషి

బోధన్ గ్రామీణం, సాలూర, న్యూస్‌టుడే: బోధన్ చక్కెర పరిశ్రమ తెరిపించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పెంటాకుర్దుక్యాంపు, సాలంపాడ్‌క్యాంపు, సాలూరలో వరి పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. చెరకు సాగు, పరిశ్రమ తెరిపించే విషయమై రైతులతో చర్చించారు. అధిక దిగుబడులు అందించే వంగడాలు సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం వరికి చీడపీడలు ఆశిస్తున్నాయని, సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. సాగులో సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడుతూ పంటల మార్పిడి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుసేన్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ శంకర్, నాయకులు గంగా శంకర్, నాగేశ్వర్‌రావు, జనార్దన్, రమేశ్, గణపతిరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చీడపీడలు ఆశించిన వరి కంకిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఏడు గేట్లు ఎత్తి.. గోదావరిలోకి వదిలి..

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్‌కు ఎగువ నుంచి 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మూడు రోజులుగా ఎగువన వర్షాలతో వరద రాక క్రమేపీ పెరుగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80.5 టీఎంసీలు) వరకు నీటిని నిల్వ చేసి మిగతాది దిగువకు వదులుతున్నారు. మంగళవారం ఏడు గేట్లెత్తి 21,868 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నట్లు ఏఈఈ కొత్త రవి తెలిపారు. వరద కాల్వకు నీటి విడుదల 15,000 క్యూసెక్కులకు పెంచారు. కాకతీయ కాల్వకు 6800, ఎస్కేప్ గేట్ల నుంచి 1200, లక్ష్మి కాల్వకు 50, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.

బోనస్.. బొనాంజా

సన్నాల సాగుతో ఎకరానికి రూ. 12,500 దక్కే అవకాశం

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

ఈ వానాకాలం సీజన్‌లో సన్న రకాలు పండించిన రైతులకు కనకవర్షం కురవనుంది. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని ఈ సీజన్ నుంచే అమలు చేయనుంది. సహకార సంఘాలు, ఐకేపీ, మెప్మా, ఐడీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 489 కొనుగోలు కేంద్రాలు తెరవనుంది. ఇక్కడ సన్న వడ్లు కొనేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరి 4.29 లక్షల ఎకరాల్లో సాగైంది. సుమారు 12 లక్షల మె.ట. దిగుబడి రానుంది. ఇందులో 3.43 లక్షల ఎకరాల్లో సన్నాలు పండినట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఈ లెక్కన ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి చొప్పున 8.50 లక్షల మె.ట. ధాన్యం ఉత్పత్తవుతుంది. ప్రైవేటు వ్యాపారులకు, రైస్‌మిల్లులకు నేరుగా పాతిక శాతం విక్రయించినా కొనుగోలు కేంద్రాలకు 6.43 లక్షల మె.ట. మేర వచ్చే అవకాశం ఉంది. జిల్లా రైతులకు బోనస్ రూ.500 కలిపితే అదనంగా రూ.321 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటికే కేంద్రం కొత్తగా ప్రకటించిన మద్దతు ధరలు ఈ సీజన్ నుంచే అమలవుతున్నాయి. క్వింటా సాధారణ రకాలకు 2,300 ఉంటే ప్రభుత్వ ఇచ్చే రూ.500 బోనస్‌తో కలిపితే రూ.2,800 రానుంది. దొడ్డు రకాలైన 'ఏ' గ్రేడ్‌కు రూ. 2320 చొప్పున చెల్లిస్తారు. ఇంతకంటే ఎక్కువగా చెల్లిస్తేనే వ్యాపారులను రైతులు కల్లాల్లోకి రానిచ్చే అవకాశం ఉంది.



మొత్తం వరి సాగు	దిగుబడి అంచనా	సన్న రకాలు	దిగుబడి అంచనా
4.29 లక్షల ఎకరాలు	12 లక్షల మెట్రిక్ టన్నులు	3.43 లక్షల ఎకరాలు	8.50 లక్షల మె.టన్నులు

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో సూచించారు. ఆయా ఎమ్మెల్సీల కాల పరిమితి 2025 మార్చి 29తో ముగుస్తుందని వెల్లడించారు. ఈ నెల 30 నుంచి నవంబరు 6 వరకు ఆన్‌లైన్, ఏఈఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇది వరకు ఓటు ఉన్నవారు సైతం పేర్లు చేర్పించుకోవాలన్నారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాలుంటే అదేనెల 23 నుంచి డిసెంబరు 9 వరకు తెలియజేయాలన్నారు. డిసెంబరు 30న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని చెప్పారు. పట్టభద్ర ఓటర్లు ఫారం-18, ఉపాధ్యాయ ఓటర్లు ఫారం-19 నింపాలన్నారు.

ఇన్‌ఛార్జి ఎంఈవోల నియామకం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 32 మండలాలకు ఇన్‌ఛార్జి ఎంఈవోలను నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు ఎంఈవోలు ఎక్కువ మండలాలకు ఇన్‌ఛార్జులుగా ఉండటంతో పర్యవేక్షణ గాడితప్పిందని భావించి అదే మండలంలో సీనియర్ ప్రధానోపాధ్యాయుల(నోడల్ అధికారులు)కు ఇన్‌ఛార్జి బాధ్యతలు కేటాయించారు. వెంకటనారాయణగౌడ్ (నిజామాబాద్ ఉత్తరం), సాయారెడ్డి(ని.దక్షిణం), జెమ్‌సింగ్(మోపాల్), రమేశ్ కుమార్(ధర్పల్లి), సీహెచ్ శ్రీధర్ (ఇందల్‌వాయి), రాజగంగారాం (ఆర్మూర్), ఆంధ్రయ్య(కమ్మర్‌పల్లి), శ్రీనివాస్ (జక్రాన్‌పల్లి), రాజేశ్వర్(బాల్కొండ), ఎన్.శ్రీనివాసరావు(కోటగిరి), గణేశ్‌రావు (రెంజల్), రేణుక (వేల్పూర్), కె.సత్యనారాయణ(మాక్లూర్), ఏ.స్వామి(భీమ్‌గల్), నరేందర్(ఆలూర్), ఈ.ఎల్.ఎన్.శ్రీనివాస్‌రెడ్డి(డిచ్‌పల్లి), గంగాధర్(నందిపేట్), రామకృష్ణ(డొంకేశ్వర్), సమ్మిరెడ్డి (మోర్తాడ్), ఆనంద్‌రావు (ఏర్గట్ల), రాములు (సిరికొండ), రవికుమార్ (ముప్కాల్), డి.శ్రీనివాస్ (మెండోరా), శంకర్ (పొతంగల్), నాగయ్య (బోధన్), జి.రాజీమంజూష (సాలురా), కె.సాయిలు(ఎడపల్లి), డి.సాయన్న(వర్ని), కట్ట శ్రీనివాస్ (రుద్రూర్), నాగనాథ్ (మోస్రా), శ్రీనివాస్‌రెడ్డి(చందూర్), ఎస్.అశోక్(నవీపేట) నియమితులయ్యారు.

BPEd
వినాయక కాలేజి - సిద్దిపేట
9966311134



నిరసనలతో అట్టుడికిన కామారెడ్డి

ఐదు గంటలు కొనసాగిన ఆందోళన

ఈనాడు, కామారెడ్డి, కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఆందోళన ఐదుగంటల పాటు కొనసాగింది. ఆరేళ్ల బాలికపై పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై ఆందోళనకారులు అక్కడకు చేరుకొని నిరసన తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్‌తో పాటు నిందితుడిపై కఠిన చర్యలు చేపట్టాలని ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు ఆందోళన కొనసాగించారు. తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు ఆందోళనకారులపై లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని నిరసకారులు రోడ్లపైకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ముందుజాగ్రత్తగా ఇతర జిల్లాల నుంచి అదనపు బలగాలను రప్పించి మోహరించారు.

శాంతియుతంగా ప్రారంభమై..

మంగళవారం ఉదయం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. కామారెడ్డి పుర ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అక్కడికి చేరుకుని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. డీఈవో, పాఠశాల నిర్వాహకులు ఆందోళనకారుల వద్దకు వచ్చేందుకు ససేమిరా అనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మధ్యాహ్నం 2 గంటలకు ఓ వర్గానికి చెందిన వందల మంది బడిలోకి చొరబడి ఫర్నీచర్, వస్తువులు ధ్వంసం చేశారు. రాళ్లతో దాడి చేయడంతో పోలీసులూ గాయపడ్డారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. ఈ ఘటనతో బడిలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు బెంబేలెత్తారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్పీ సింధూశర్మ చర్చలు జరిపి ఆందోళనను విరమింపజేశారు.


ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు





(c) eenadu

నిజామాబాద్ ఐటీఐలో కొత్త కోర్సులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

మారుతున్న పరిస్థితులకనుగుణంగా పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశ్రామిక శిక్షణ, ఉపాధి కల్పన మండలి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీఐల స్థితిగతులు, పరికరాలు, మౌలిక వసతులపై అధ్యయనం చేస్తూ ఉన్నతీకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఇదివరకే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విజయవంతమైన టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీటీఎల్ ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిజామాబాద్, ఖమ్మం, మల్లెపల్లి(హైదరాబాద్) ఐటీఐల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలుర ఐటీఐలో ఆరు నూతన కోర్సులు ప్రవేశ పెట్టి ఐదో దశలో ప్రవేశాలకు అవకాశం కల్పించింది.



నగరంలోని బాలుర ఐటీఐ భవన సముదాయం

ప్రవేశం ఇలా..

☛ ఈ నెల 23వ తేదీ నుంచి 28 వరకు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని, అన్ని నిజధ్రువపత్రాలు అప్లోడ్ చేయాలి.

☛ 25వ తేదీ నుంచి 28 వరకు ఉదయం 11 గంటలకు బాలుర ఐటీఐ కళాశాలకు హాజరు కావాలి. మొదటి రోజు ప్రవేశం లభించని వారు రెండో రోజు, అడ్మిషన్ పూర్తి కాని వారు మూడో రోజు హాజరు కావాల్సి ఉంటుంది.

☛ గైర్హాజరైతే మెరిట్ ప్రకారం ఆ రోజు హాజరైన అభ్యర్థికి సీటు కేటాయిస్తారు.

☛ దరఖాస్తు సమయంలో ఇచ్చిన చరవాణి నెంబర్, ఈ-మెయిల్ కోర్సు పూర్తయ్యేవరకు మార్చుకోరాదు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- యాదగిరి, జిల్లా కన్వీనర్, బాలుర ఐటీఐ ప్రిన్సిపల్, నిజామాబాద్



రాష్ట్రంలో మూడింటికి అవకాశం దక్కితే అందులో బాలుర ఐటీఐ ఉండటం గొప్ప విషయం. భవిష్యత్తు డిమాండ్ దృష్ట్యా ఈ కొత్త కోర్సులు ప్రవేశపెట్టినందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

కోర్సులు, సీట్ల వివరాలు

కోర్సు	కాలపరిమితి	సీట్లు
మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమెషన్	ఏడాది	40
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	ఏడాది	40
అర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	ఏడాది	20
బేసిక్ డిజైన్ అండ్ వర్చువల్ వెరిఫైయర్	రెండేళ్లు	24
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెకానిక్ టక్నీషియన్	రెండేళ్లు	24
మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్	రెండేళ్లు	24
	మొత్తం	172

మహిళ హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ కారాగార శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: మహిళను హత్యచేసిన కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లికి చెందిన ఓడ్నాల కాశమణి, సుతారి చిన్న బాలయ్యలకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా విధిస్తూ నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక జడ్జి టి.శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ముదెల్లికి చెందిన కాశమణి తన భర్తతో బాన్సువాడ మండలం జె.కె.తండాకు చెందిన మహిళ(28)తో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానించారు. ఈ విషయమై వారి మధ్య తరచూ గొడవ జరిగేది. ఆమె నుంచి భర్తను కాపాడుకునేందుకు గ్రామానికే చెందిన సుతారి చిన్న బాలయ్యతో కలిసి హత్యకు ప్రణాళిక వేశారు. 2019 ఆగస్టు 29న భర్తతో ఆమెతో కలిసి బాన్సువాడ కూరగాయల సంతకు వెళ్లారు. గాలిపూర్‌లో బంధువుల వద్ద కందురు ఉందని తీసుకెళ్లారు. నిజాంసాగర్ కెనాల్‌పై నడుచుకుంటూ వెళ్తున్నారు. అప్పటికే అక్కడున్న బాలయ్యతో కలిసి మహిళ మెడకు తాడుతో చుట్టి శ్వాస ఆడకుండా చేశారు. ఆపై బండరాయితో తలపై కొట్టి చంపి ఇంటికెళ్లిపోయారు. మహిళ భర్త కాశమణికి ఫోన్ చేయగా ఆరా తీస్తే ముందే వెళ్లిపోయిందని బుకాయించారు. 2019 ఆగస్టు 30న బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. నేరం అంగీకరించడంతో ఇద్దరిపై హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. పోలీసుల తరఫున అదనపు కోర్టు పీపీ బంటు వసంత్ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి ఈ మేరకు తీర్పు చెప్పారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

వ్యక్తిగత వైద్యం మంచిది కాదు

మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత వైద్యం మంచిది కాదని, అనారోగ్యంతో ఉంటే ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ పేర్కొన్నారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. రక్తహీనత నివారణకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ధాత్రిక వెంకటేశ్వర్‌రావు, వైద్యులు నాగారాజు, రవితేజ, లావణ్య, రాజశ్రీ, అర్విండ్, సలీముద్దీన్, మాధవి, మినాజ్, సుమేయా తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ

న్యూస్‌టుడే,కామారెడ్డి కలెక్టరేట్



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న మిషన్ భగీరథ ఈఈ రమేశ్

పల్లెల్లో మిషన్ భగీరథ పనుల నిర్వహణ కోసం పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ ప్రారంభమైంది. ప్రభుత్వ సూచన మేరకు అధికారులు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 23వ తేదీన ప్రారంభమైన శిక్షణ ఐదు విడతల్లో సాగనుంది. ఈ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత కార్మికులు భగీరథ పనులపై అవగాహన పెంచుకుని సొంతంగా మరమ్మతులు చేసి ప్రజలకు నీటి సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుంది.

సేవల్లో జాప్యం ఉండదు - రమేశ్, ఈఈ, మిషన్ భగీరథ, కామారెడ్డి

ప్రభుత్వ సూచన మేరకు మల్టీపర్పస్ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. ఇది నెల రోజుల పాటు కొనసాగుతోంది. స్థానికంగా పనిచేసే సిబ్బందికే శిక్షణ ఇవ్వడం వల్ల వారు వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేస్తారు. దీంతో ప్రజలకు సత్వర సేవలు అందుతాయి.

ఏయే అంశాలపై అంటే..

జిల్లాలో ఒక్కో పంచాయతీ నుంచి ఒక్కో కార్మికుడిని శిక్షణ కోసం ఎంపిక చేశారు. మేజర్ పంచాయతీలు ఉంటే ఇద్దరు చొప్పున తీసుకున్నారు. మొత్తంగా ఐదు విడతల్లో శిక్షణ నిర్వహిస్తుండగా.. ఒక్కో విడతలో నాలుగురోజుల పాటు కార్యక్రమం కొనసాగనుంది.

నీటి నాణ్యతపై: గ్రామాల్లో సరఫరా చేస్తున్న నీటి నాణ్యత పరీక్షలను ఇకపై మల్టీపర్పస్ కార్మికులే నిర్వహిస్తారు. ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకులను శుభ్రం చేయడం, ఎన్ని రోజులకు క్లోరినేషన్ చేయాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు. ట్యాంకు వద్ద సమస్యలు ఉత్పన్నమైతే సరిచేసి నీటి సరఫరా కొనసాగిస్తారు.



హ్యాండ్ పంపులను వినియోగంలోకి తీసుకురావడం: గ్రామాల్లో ఒకప్పుడు హ్యాండ్ పంపులే ఉండేవి. ఇప్పుడవి నిరుపయోగంగా ఉన్నాయి. మల్టీపర్పస్ కార్మికులు వాటికి మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలి.


ఎలక్ట్రీషియన్: గ్రామాల్లో సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ బోరుబావులకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. ప్యానల్ బోర్డులు చెడిపోయి సమస్య తలెత్తుతుంది. ఎలా పరిష్కరించాలో ఇంజినీర్లు కార్మికులకు శిక్షణ ఇస్తారు.

ప్లంబింగ్: గ్రామాల్లో ప్రధానమైనది పైప్‌లైన్ లీకేజీ సమస్య. రోడ్లపై, మురుగుకాల్వల్లో పైప్‌లైన్లు పగిలి నీరు కలుషితం అవుతుంది. దీంతో ప్లంబర్ వచ్చే వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది. అందుకే స్థానిక కార్మికుడికే ప్లంబింగ్ పనుల్లో తర్ఫీదు ఇస్తున్నారు.

వల చుట్టుకొని ఇద్దరు మత్స్యకారుల మృతి

● వేర్వేరు చోట్ల ఘటనలు

నవీపేట, బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు వెళ్లి వల చుట్టుకుని నీటిలో మునిగి ఇద్దరు మత్స్యకారులు మృతిచెందిన ఘటనలు నవీపేట, సాలూర మండలాల్లో చోటుచేసుకున్నాయి.



భూమన్న



సాయిలు

నవీపేట ఎస్సై వినయ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మహంతానికి చెందిన మత్స్యకారుడు పల్లికొండ భూమన్న (61) స్థానిక చెరువులో చేపలు పట్టేందుకు ఈ నెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు అదే రోజు రాత్రి చెరువు పరిసరాల్లో గాలించినా భూమన్న కనిపించలేదు. మంగళవారం ఉదయం మరోసారి గాలించగా చెరువులో అతని మృతదేహం లభ్యమైంది. చేపలు పడుతుండగా కాళ్లకు వల చుట్టుకుని ఈత రాక నీటిలో మునిగి చనిపోయినట్లు భూమన్న కొడుకు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సాలూర మండలంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హున్సాకు చెందిన సాయిలు (44) సోమవారం సాయంత్రం మండల శివారులోని రాంసాగర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు కుంట వద్దకు వెళ్లి చూడగా ఒడ్డున చెప్పులు, దుస్తులు ఉన్నాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా సాయిలు మృతదేహం లభ్యమైంది. అతను నీటిలో వలకు చుట్టుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. సాయిలుకు కొడుకు(9), కూతురు(7) ఉన్నారు. భార్య కొన్నేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయారు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

నృత్యాలు చేస్తూ.. అవగాహన కల్పిస్తూ



నగరంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు స్వచ్ఛ భారత్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, బాలికల సంరక్షణ వంటి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథక వ్యవస్థాపక దినోత్సవ సంబరాల్లో భాగంగా గ్రామీణ మండలం చక్రధర్‌నగర్ గ్రామ ప్రధాన రహదారిపై నాటికలు, నృత్యాలతో పై విషయాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ సైదా జైనాబ్, వైస్ ప్రిన్సిపల్ భార్గవి, ప్రోగ్రాం ఆఫీసర్ వి.జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ గ్రామీణం



మాధవనగర్ వైపు బురద రోడ్డు



డిచ్‌పల్లి వైపు గుంతలమయంగా

తారు తొలగింది.. మరమ్మతులు చేయండి

డిచ్‌పల్లి-నిజామాబాద్ బైపాస్ వద్ద రైల్వే వంతెన పనుల కారణంగా అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గుంతల్లో నీరు నిలవడంతో లోతు తెలియక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా తాత్కాలిక రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం

27న నిధి ఆప్కే నికత్

ఖలీల్‌వాడి: నిధి ఆప్కే నికత్ కార్యక్రమం ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-1 గణేశ్ కుమార్ పేర్కొన్నారు. ముబారక్ నగర్‌లో విజయ్ హైస్కూల్, కామారెడ్డి జిల్లా కేంద్రం నిజాంసాగర్ రోడ్డులోని చాట్ల నర్సయ్య రామయ్య బీడీ తయారీ కంపెనీలో ఉంటుందని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పింఛనర్లు తగిన ఆధారాలతో వచ్చి ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు రేపు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(దుబ్బ)లో ఈ నెల 26న 69వ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నామని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గణేశ్, శ్యామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 2005 తర్వాత పుట్టినవారు అర్హులన్నారు. ఎంపికైనవారు వచ్చే నెలలో కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలకు ఆధార్‌కార్డు తీసుకురావాలని తెలిపారు.

రాష్ట్ర జట్టు శిక్షకుడిగా శ్యాం



నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర బాలుర బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు శిక్షకుడిగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యాంను నియమించారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29 వరకు హరియాణాలో 43వ జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల పోటీలు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఫీజు చెల్లింపునకు చివరి అవకాశం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు 25, 26 తేదీల్లో అవకాశం కల్పించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో సబ్జెక్టుకి రూ.100తో పాటు అపరాధ రుసుం రూ.500, ఇంటర్మీడియట్‌లో సబ్జెక్టుకి రూ.150తో పాటు అపరాధ రుసుం రూ.1000 చెల్లించాలని సూచించారు. సందేహాలుంటే ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రవీందర్ చరవాణి 80084 03518లో సంప్రదించాలని సూచించారు.


వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేసేందుకు ఒప్పంద పద్ధతిలో పనిచేసేందుకు వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు సివిల్ అసిస్టెంటు సర్జన్ స్పెషలిస్ట్(జనరల్ మెడిసిన్/జనరల్ సర్జన్) ఒకరు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(ఎంబీబీఎస్) నలుగురు, ఆర్మూర్ ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేసేందుకు మెడికల్ ఆఫీసర్(ఎంబీబీఎస్) ఒకరు అవసరమని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు జిల్లా కేంద్రంలోని వైద్యకళాశాల ఆవరణలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ నెల 28న అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. నిజధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి

సిరికొండ, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సర్వే పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులు, పర్యవేక్షకులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రజావాణి, ధరణి దరఖాస్తుల వివరాలు తహసీల్దార్ రవీందర్‌రావును అడిగి తెలుసుకున్నారు. నాయబ్ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐలు గంగారాజం, నాగన్న, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

319 కిలోల గంజాయి పట్టివేత



నిందితులతో అధికారులు, సిబ్బంది

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శివారులో తనిఖీల్లో రూ.79.75 లక్షల విలువైన 319 కిలోల గంజాయి, రెండు కార్లు, రెండు ద్విచక్రవాహనాలను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంటు, పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆబ్కారీ అధికారులు జనార్దన్‌రెడ్డి, గణేశ్, జానయ్య, తిరుపతి, కరంచంద్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వేర్వేరు ఘటనల్లో సరకు పట్టుబడినట్లు తెలిపారు. వాహనాలతో కలిపి మొత్తం విలువ రూ.కోటి ఉంటుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లికి చెందిన నేరెళ్ల అపర్ణ, అఖిల్ (తల్లీకొడుకు) కారులో హైదరాబాద్ తరలిస్తున్న 100 కిలోల గంజాయిని భద్రాచలం వద్ద సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధమున్న పాత నేరస్థుడు నిజామాబాద్‌కు చెందిన మునావర్ అలీని అదుపులోకి తీసుకున్నారు. ఈయన ఓ మహిళా కార్పొరేటర్ కుమారుడు కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మోతుగూడెం సరిహద్దు ప్రాంతాల నుంచి కారులో తరలిస్తున్న 180కిలోల గంజాయిని సోమవారం పట్టుకుని హైదరాబాద్ బేగంబజార్‌కు చెందిన దత్తు పంచాలను అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో హైదరాబాద్ ఫతేనగర్, బాలానగర్‌కు చెందిన శక్తి రాహల్, గోపిశెట్టి అక్షిత్‌లను అదుపులోకి తీసుకొని 14, 25 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మరో నలుగురు పరారయ్యారన్నారు.

మునావర్‌పై పలు కేసులు: నిజామాబాద్ నేరవిభాగం: భద్రాచలంలో పట్టుబడిన నిజామాబాద్‌కు చెందిన నిందితుడు మునావర్‌పై 2013, 2017, 2018లో నిజామాబాద్ రూరల్, నాలుగో ఠాణా, నిజామాబాద్ రైల్వే పోలీసు ఠాణాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా బచ్చన్నపేట, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, విజయవాడలో కేసులు నమోదైనట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు పాలనాధికారి అంకిత్, కమిషనర్ మకరందు

ఓటరు జాబితా సవరణలో తప్పులు దొర్లొద్దు

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటరు జాబితా సవరణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతుతో మాట్లాడారు. ఇంటింటి సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. వలస వెళ్లినవారు, చనిపోయిన ఓటర్లు ఉంటే వారికి నోటీసు జారీ చేసిన తరువాత తొలగించాలని చెప్పారు. అదనపు పాలనాధికారులు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ ఉన్నారు.

అక్టోబరు 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: న్యాల్‌కల్‌రోడ్ లలితాదేవి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మాధికారి వేలేటి రాజేందర్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వేడుకలు ఉంటాయన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి అన్నారు. వర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక అంశం ఎంపిక అవగాహన సదస్సుకు రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు భిన్న అంశాల్లో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. అంశాల ఎంపికలో పాటించాల్సిన పద్ధతులను సెమినార్ డైరెక్టర్ ఆచార్య ఆంజనేయులు వివరించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, అధ్యాపకులు ఖైసర్ మహమ్మద్, అపర్ణ, రాజేశ్వరి, వాణి ప్రసంగించారు. అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, అధ్యాపకులు రాంబాబు, రవీందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న సైన్స్ డే

తెవివి క్యాంపస్: తెవివిలోని జువాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 26న భిక్కనూరు దక్షిణ ప్రాంగణంలో నిర్వహించే జాతీయ సైన్స్ డే ఉత్సవాల బ్రోచర్లను మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి ఆవిష్కరించారు. సదస్సులో ప్రముఖులు కీలక ఉపన్యాసం చేస్తారని ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రసన్నశీల తెలిపారు. ఫార్మాస్యూటికల్ విభాగం అధ్యాపకులు సత్యనారాయణ, వాసం చంద్రశేఖర్, పీఆర్వో పున్నయ్య పాల్గొన్నారు.

గోడప్రతుల ఆవిష్కరణ

తెవివి క్యాంపస్: తెవివి పరిపాలన భవనం ఎదుట మంగళవారం పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ గోడ ప్రతుల్ని అర్థశాస్త్రం విభాగం అధ్యాపకుడు పున్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచిపోషించే బలమైన పాత్రను పీడీఎస్‌యూ నిర్వహించిందన్నారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్, కోశాధికారి నిఖిల్, నాయకులు తదితరులున్నారు.

ఎల్లప్పుడూ ధైర్యంగా ఉండాలి



ప్రసంగిస్తున్న జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి రసూల్‌బీ

తెవివి క్యాంపస్: ఏదైనా సమస్య వచ్చినప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి రసూల్‌బీ అన్నారు. తెవివి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం పురస్కరించుకొని యూనిట్లు 1, 4 ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సేవా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వర్సిటీ పరిధిలో చేస్తున్న కార్యకలాపాలను సమన్వయకర్త రవీందర్‌రెడ్డి వివరించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఆరతి, ప్రోగ్రాం అధికారులు ప్రవంతి, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెవివిలో మళ్లీ పాము కలకలం



గ్రంథాలయంలో పాము

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: గత శనివారం తెలంగాణ వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ కళాశాల ల్యాబ్‌లో పాము కనిపించిన ఘటన మరవకముందే.. మరోసారి గ్రంథాలయంలో పాము ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. గ్రంథాలయంలోని ఓ గదిలో సోమవారం రాత్రి కొందరు విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో పాము కనిపించడంతో భయంతో కేకలు వేసి పరుగులు పెట్టారు. అక్కడున్న సిబ్బంది పామును బయటికి పంపించారు. పాములు వస్తున్నాయని అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

EENADU Classifieds

EDUCATION

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D&B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. Ph:8866977112, 339

బాన్సువాడ LAXMI TVS నందు పనిచేయుటకు అనుభవము గల మెకానిక్స్ మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: ✆ : 9550370404.

కావలెను. నిజామాబాద్. కామారెడ్డి, ఆర్మూర్, నిర్మల్ ప్రాంతాలలో త్వరలో ప్రారంభం కానున్న త్రీవీలర్ షోరూంలో పని చేయుటకు (అనుభవం గల స్థానికులు) బ్రాంచ్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్ కావలెను. ఆసక్తి గలవారు తమ బయోడాటాను ఈ సెల్ నం.కి వాట్సాప్ చేయగలరు. సెల్: 8520044244.

REAL ESTATE

AGRICULTURE LANDS

Agriculture Land for Sale 14-Acres in LAKHORA Village, Fertile Soil, Good Water, Perfect for FARM HOUSE (or) Agriculture. ✆ : 8331007002.

JOBS

WANTED : Well Experienced Front Office/Clerical Staff to work in a reputed Junior College, Nizamabad. Qualification : Any Degree /PG. Salary: Negotiable. Contact: ✆ : 9346977314, 9346977315.

కావలెను. మారుతి సుజుకి నం.1 డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆర్మూర్ బ్రాంచ్ హైవేకు దగ్గర అర్గుల్ నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ అర్హత ఉండి సేల్స్‌లో అనుభవం గల వారు పై అడ్రసులో 27-09-24 శుక్రవారం మరియు 28-09-24 శనివారం తేదీలలో ఉ|| 10 గం||లకు జరుగు ఇంటర్వ్యూలో తమ బయోడాటా మరియు డ్రైవింగ్ లైసెన్స్‌తో సంప్రదించగలరు. ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఇన్‌సెంటివ్స్ ఇవ్వబడును. సంప్రదించండి సెల్ : 9885453222.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

To Book Your Classified Advertisements Please Call: ✆ 9000566042 ★ GST వర్తించును.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి. ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.

ఈనాడు ప్రకటనల విభాగం ★ GST వర్తించును

నిజామాబాద్: 9000566042, 8008709958, 9963849851, 9963849825, బోధన్: 9959097634, ఆర్మూర్: 8008553004 కామారెడ్డి : 8008709960, బాన్సువాడ : 8008709959

(c) eenadu

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బోధన్ : పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలు నాటాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి ఆయన మొక్కలు నాటారు. తహసీల్దార్ విఠల్, ప్రిన్సిపల్ సురేష్, వైస్‌ప్రిన్సిపల్ సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

ఆలయ వార్షికోత్సవం

బోధన్, న్యూస్‌టుడే : బోధన్ పట్టణ శివారులోని కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, సత్యం, అర్చకుడు రాచప్ప, శంకరప్ప, సురేష్, సత్యం, నరసింహ పాల్గొన్నారు.



ఆలయం వద్ద నాయకులు, భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



గంజ్ ప్రాంతంలో

సమస్య: బోధన్ ఆజాంగంజ్ ప్రాంతంలో రహదారి వెంట పెరిగిన పొదలు తొలగించాలి.
- రాజు, బోధన్

సమస్య : బోధన్ గోశాల కాలనీలో కాలువల్లో పేరుకున్న పూడిక తొలగించాలి.
- సల్మాన్, బోధన్



గోశాల ప్రాంతంలో

పరిష్కారం : ఈ సమస్యలను శానిటరీ జవాన్ గాబ్రియెల్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బంది చేత శుభ్రం చేయించారు.

సమస్య: న్యాల్‌కల్ రోడ్డు వివేకానందనగర్ కాలనీలో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమల సమస్య తీవ్రమవుతోంది.
- సూర్యప్రకాష్, కాలనీవాసి

సమాధానం : పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వలు శుభ్రం చేయిస్తా.
- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు, జోన్-2

సమస్య: వినాయక్‌నగర్ మహాలక్ష్మీనగర్ రోడ్డునంబర్-1లో వీధిదీపం వెలగడం లేదు.
- శ్రీనివాస్, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం
. **- ఇనాయత్, ఏఈ, నగరపాలక సంస్థ**

సమస్య: ధనంబండ తండా నుంచి చేంగల్ వెళ్లే రోడ్డు తారు తొలగిపోయి పూర్తిగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది.
- రవీందర్, ధనంబండ తండా

పరిష్కారం: గతంలో ఈ రోడ్డు మరమ్మతుల గురించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి. **- విజయ్, పంచాయతీ కార్యదర్శి, ధనంబండ తండా**

– న్యూస్‌టుడే, ధర్పల్లి, బోధన్, నిజామాబాద్ అర్బన్

కారాగారం పరిసర ప్రాంతాల పరిశీలన

ఖలీల్‌వాడి : జిల్లాకేంద్ర కారాగారం పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచరిస్తుందని జైలు అధికారులు అటవీ శాఖ అధికారులకు తెలుపడంతో మంగళవారం నిజామాబాద్ ఎఫ్‌డీవో సుధాకర్‌రావు, నార్త్ రేంజ్ అధికారి సంజయ్ గౌడ్ పరిశీలించారు. రెండు ట్రాప్ కెమెరాలు అమర్చారు. ఎలుగుబంటి చిత్రాలు ఏమైనా వచ్చాయా లేదా అనేది రోజూ సిబ్బంది పరిశీలిస్తారని తెలిపారు. సెక్షన్ అధికారులు ప్రతాప్, గంగారెడ్డి, బీట్ అధికారులు నవీన్, జయరాజ్, జైలు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

జక్రాన్‌పల్లి : మునిపల్లిలోని 179 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి కబ్జాపై వచ్చిన ఫిర్యాదుతో పోలీసు, రెవెన్యూ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్, జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామాల మధ్య తరచూ భూమి సరిహద్దులు, కబ్జాపై గొడవలు జరుగుతున్నాయి. తమ పరిధిలోని భూమిని కొంతమంది సాగుకు సిద్ధం చేస్తున్నారని మునిపల్లి వీడీసీ సభ్యులు, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ సాయారెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచి చిన్నసాయిరెడ్డి, భాజపా నాయకుడు రాజారెడ్డి తదితరులు అధికారులకు సమాచారం అందించారు. జక్రాన్‌పల్లి తహసీల్దారు కిరణ్మయి, సర్వేయర్ రత్నాకర్, ఎస్సై తిరుపతి తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దీనిపై మునిపల్లి గ్రామస్థులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం : మూడో ఠాణా పరిధిలో ఒకరిపై దాడిచేసిన వ్యక్తిని అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..గౌతమ్‌నగర్‌లో గత నెల 28న రాత్రి 9 గంటలకు రోడ్డుపై పవన్ అనే వ్యక్తి ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుండటంతో అదే కాలనీకి చెందిన మాధవ్ ఆపే ప్రయత్నం చేయగా దాడి చేశాడు. దీంతో మాధవ్ కంటికి తీవ్రగాయమైంది. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా పవన్‌ను అరెస్టుచేసి రిమాండుకు తరలించామని ఎస్‌హెచ్‌వో మహేశ్‌కుమార్ తెలిపారు.

డీపీవోకు సన్మానం

నిజామాబాద్ అర్బన్ : బదిలీపై వెళ్తున్న డీపీవో తరుణ్‌కుమార్‌ను మంగళవారం కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. జిల్లా వాసులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ సాయాగౌడ్, జడ్పీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్‌రావు, ఇన్‌ఛార్జి డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో శివకృష్ణ, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.



తరుణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

ప్రయాణం.. ప్రమాదం

బోధన్ : బోధన్ నుంచి చెక్కిక్యాంపు వెళ్లే మూలమలుపు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. టైరోడ్డులో చెక్కిక్యాంపు, పెంటాకుర్దు వెళ్లడానికి ఇక్కడే దారి మళ్లుతారు. సరిగ్గా మూలమలుపు వద్దనే గుంత కారణంగా రాకపోకల సమయంలో ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. టైరోడ్డు జాతీయ రహదారి పరిధిలోకి వెళ్లింది. మూలమలుపు నుంచి పెంటాకుర్దు రహదారి రోడ్లు, భవనాలశాఖ పరిధిలో ఉంది. ఈ విషయంపై ఎన్‌హెచ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



చెక్కిక్యాంపు మూలమలుపు వద్ద..

బోధన్ గ్రామీణం : బోధన్-కల్దుర్కి దారిలో బండారుపల్లి పసుపువాగు వంతెన మూలమలుపు ప్రమాదకరంగా మారింది. చెట్లు పెరిగి రోడ్ల మీదకు వచ్చాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని చెబుతున్నారు. నిత్యం ఈ దారి మీదుగానే బండారుపల్లి, రాంపూర్, కల్దుర్కి, సిద్ధాపూర్, ఖండ్‌గాం, బిక్నెల్లి, కొప్పర్గ, హంగర్గ గ్రామాల ప్రజలు బోధన్‌కు వస్తుంటారు.



బోధన్ - బండారుపల్లి మధ్య వంతెన సమీపంలో..

☛ పొదలు, గుంతలతో వాహనదారుల ఇక్కట్లు

అసలే రహదారుల నిర్వహణ అంతంతమాత్రం.. ఆపై వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి.. గుంతల్లో అయినా కుదుపులతో ప్రయాణం చేద్దామంటే రహదారి కనిపించని పరిస్థితి.. ఇవీ వాహనదారుల అవస్థలు. సమస్య ఏ రకంగా ఉన్నా.. ప్రయాణం మాత్రం ప్రమాదకరంగా సాగుతోందని వాహనదారులు వాపోతున్నారు. వర్షాలకు వివిధ ప్రాంతాల్లోని రహదారులు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఈ గుంతలు మూలమలుపుల్లో ఉండటం, దీనికి తోడు పెరిగిన పొదలు, చెట్లకొమ్మలు దారిని కమ్మేశాయి. ఫలితంగా రోడ్డు సరిగా ఏర్పడక, ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును కప్పేసిన చెట్లను తొలగించడం, గుంతలు పూడ్చే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, బోధన్

నవీపేట : రాంపూర్, ఫతేనగర్, ఎల్‌కే ఫారం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా దట్టమైన పొదలు, చెట్లు పెరిగి రహదారి ఇరుకుగా మారింది. పొదలు రోడ్డు మీదకు వచ్చాయి. కట్టమైసమ్మ ఆలయం వద్ద ఒక వైపు చెరువు ఉండటం, పొదలతో మూల మలుపులు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారముంది.



రాంపూర్ శివారులో ఇరువైపులా చెట్లు, పొదలు

ఎడపల్లి : జంలం, ఎమ్మెస్సీఫారం, జానకంపేట శివారులో నిజామాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై పలు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో వేగనిరోధకాలు లేవు. ఈ మలుపుల వద్ద గతంలో జరిగిన ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఎమ్మెస్సీ ఫారం- ధర్మారం, ఏఆర్పీ క్యాంపు-దుబ్బతండా గ్రామాల మధ్య పల్లెదారులు గుంతలమయమయ్యాయి.



ఎమ్మెస్సీ ఫారం - ధర్మారం మధ్య రహదారి ఇలా..

షాపింగ్‌మాల్‌కు నోటీసులు

నిజామాబాద్ నగరం : హైదరాబాద్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న ఓ షాపింగ్‌మాల్‌కు టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. టౌన్‌ప్లానింగ్ అనుమతి ఉన్నా సెట్‌బ్యాక్ లేకపోవడం, ఇతర అనుమతులు ఏమి ఉన్నాయనే విషయంపై నగరపాలక సంస్థకు తెలియజేయాలని కోరుతూ నోటీసులు జారీ చేశారు. జనవరిలో టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతి తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థుల మధ్య వివాదం

బోధన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ వ్యవహారంలో ఓ విద్యార్థి తల్లి మరో విద్యార్థిపై చేయిచేసుకుంది. అధ్యాపకులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఇరువురికి సర్దిచెప్పి పంపారు.

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం: హైదరాబాద్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటి జాతీయ సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపికయ్యారని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, రాజాగౌడ్ ప్రకటనలో తెలిపారు. స్వర్ణాలు సాధించిన నాగనాథ్ (లాంగ్‌జంప్), సాయిచరణ్ (పరుగు), సత్య(లాంగ్ జంప్), రజతం సాధించిన జైపాల్(జావెలిన్ త్రో), కాంస్యాలుసాధించిన అంకిత (పరుగు), వంశీ(పరుగు), బంతిలాల్ (హైజంప్)ను అభినందించారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తితో శ్రీరామసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన మహిళ సోమవారం రాత్రి మెండోరా ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రాజెక్టు ఉద్యోగులు రక్షించారు. మోర్తాడ్ మండలానికి చెందిన వివాహిత డ్యామ్‌లో దూకడానికి ప్రయత్నిస్తుండగా.. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు గమనించి ఆరా తీశారు. ఆత్మహత్య చేసుకోవడానికి చెప్పడంతో మెండోరా ఎస్సై నారాయణ సముదాయించి కుటుంబీకులకు అప్పగించారు.

మెరుగైన సేవలు అందించాలి

బోధన్ : రోగులకు మెరుగైన సేవలు అందించాలని టీవీవీపీ జిల్లా పర్యవేక్షణాధికారి(డీసీహెచ్‌ఎస్) డా. శ్రీనివాస్‌ప్రసాద్ సిబ్బందికి సూచించారు. బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానాను ఆయన మంగళవారం సందర్శించారు. సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో వైద్యసేవలందుతున్న తీరుపై ఆరా తీశారు. వైద్యాధికారి సుమంత్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ కలెక్టరేట్ : ఇన్‌ఛార్జి డీపీవోగా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ డీఎల్‌పీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డీపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పూర్తి స్థాయి అధికారి వచ్చేంత వరకు కొనసాగుతారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్ : బోధన్ దవాఖానాలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీవీవీపీ దవాఖానాల జిల్లా పర్యవేక్షణాధికారి డా. శ్రీనివాస్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. బోధన్ ఆసుపత్రిలో జనరల్ సర్జన్ లేదా జనరల్ ఫిజిషియన్ స్పెషలిస్టు 1, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(జీడీఎంవో) 4 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25-27 మధ్య డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

తాగునీటి ఎద్దడిపై ఆందోళన

కోటగిరి : తాగునీటి ఎద్దడిని తీర్చాలని కోటగిరి రచ్చగల్లీ కాలనీవాసులు మంగళవారం ఆందోళనకు దిగారు. కొద్ది రోజులుగా నీటిసరఫరా జరగడం లేదంటూ వారు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలోకి దూసుకెళ్లి అధికారులతో వాదనకు దిగారు. తాగునీటి సరఫరాశాఖ డీఈ మున్నీ, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో కాలనీ వాసులు శాంతించారు.

సభ్యత్వ నమోదు పక్కాగా చేయించాలి

నిజామాబాద్ నగరం, మోపాల్, న్యూస్‌టుడే: ఈ నెల 25న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ప్రతి కార్యకర్త 100 మందిని పార్టీలో చేర్చేలా మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పక్కాగా చేపట్టాలని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో అర్బన్ నియోజకవర్గం సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలిచిందన్నారు. రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ తరువాతి వరుసలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూమన్న, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, సంతోష్, సుదర్శన్, రాజు, కిషన్, సవిత తదితరులు పాల్గొన్నారు. నర్సింగ్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి హాజరై మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు రవి కుమార్, నాయకులు లక్ష్మారెడ్డి, పద్మారెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

లైన్‌మెన్ సస్పెన్షన్

నిజామాబాద్ అర్బన్ : తన కింది స్థాయి సిబ్బంది ప్రమాదానికి గురైన ఘటనలో బాధ్యుడిని చేస్తూ నాగారం డి-8 సెక్షన్ లైన్‌మెన్ మోహన్‌ను సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇంద్రాపూర్ కాలనీలో విద్యుత్తు అంతరాయం తలెత్తుతోందని వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో లైన్‌మెన్ మోహన్, ఏఎల్ఎం నాగన్న మంగళవారం అక్కడికి వెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ పైభాగాన సమస్య ఉండటంతో ఏఎల్ఎం పైకెక్కి తీగలను సరిచేసే క్రమంలో షాక్ తగిలి కింద పడిపోయి గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుణ్ని ఎస్ఈ రవీందర్, డీఈ శ్రీనివాస్‌రావు పరామర్శించారు. విద్యుత్తు సరఫరా ఉందో? లేదో? తెలుసుకోకుండా వ్యవహరించిన లైన్‌మెన్‌పై వేటు వేస్తూ డీఈ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు ఇచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బోధన్ గ్రామీణం : గుర్తుతెలియని వ్యక్తి (35) నిజామాబాద్ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందారు. సదరు వ్యక్తి సోమవారం రాత్రి బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు అతనిని అంబులెన్స్‌లో జిల్లాకేంద్ర దవాఖానాకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా

బోధన్ గ్రామీణం: పట్టణంలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరికి బోధన్ సెకండ్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ మంగళవారం తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

మోపాల్: సిర్పూర్ తండాలో చోటుచేసుకున్న ఘటనలో నమోదైన అట్రాసిటీ కేసు విషయంలో మంగళవారం ఏసీపీ రాజావెంకట్రాంరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లి బాధితుడు గుండునాయక్‌పై జరిగిన దాడి, పొలం ధ్వంసం తదితర అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ ఉన్నారు.

పొక్లెయిన్ జప్తు

పొతంగల్, న్యూస్‌టుడే: జల్లాపల్లి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, పొక్లెయిన్‌లను జప్తు చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా నిల్వ చేసి పొక్లెయిన్ సాయంతో టిప్పర్‌లలో ఎత్తి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం దాడులు చేశారు. దాడుల్లో ఒక టిప్పర్, పొక్లెయిన్ పట్టుబడ్డాయన్నారు. పట్టుబడ్డ టిప్పర్‌ను తగు చర్యల నిమిత్తం భూగర్భ, గనులశాఖ అధికారులకు సిఫార్సు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

వ్యక్తికి దేహశుద్ధి

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లికి చెందిన ఓ వ్యక్తి పోచారంలో ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్న వివాహిత ఇంటికి మంగళవారం వెళ్లాడు. దీంతో ఆమె మృతికి సదరు వ్యక్తే కారణమంటూ పలువురు గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. వెంటనే మరికొందరు గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకొన్న పోలీసులు సదరు వ్యక్తితో పాటు అతని వెంట వచ్చిన మరొకరిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రుద్రూర్, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం బోధన్ వైపు వెళ్తున్న ఇసుక టిప్పర్‌ను రుద్రూర్ చౌరస్తాలో అడ్డుకుని పరిశీలించారు. సరైన అనుమతులు లేకుండా తరలిస్తుండటంతో ఆ టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని ఠాణాకు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడి

పొతంగల్, న్యూస్‌టుడే: పొతంగల్ మండలం టాక్లీలో అందిన సమాచారం మేరకు జూద స్థావరంపై మంగళవారం దాడి నిర్వహించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. నలుగురు జూదరులు పట్టుబడగా వారి నుంచి రూ.10,740 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సొంత భవనం లేక.. ఇబ్బందులు తప్పక

న్యూస్‌టుడే, నిజామాబాద్ గ్రామీణం



వాన నీరు రావడంతో పరికరాలను పక్కకు తీస్తున్న సిబ్బంది

గ్రామీణ మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం లేక అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అభివృద్ధి పనుల్లో భాగంగా 2022లో పాత భవనం కూల్చివేసి మండల పరిషత్ కార్యాలయాన్ని పాత డీపీవో కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ వర్షపు నీరు భవనం లోపలికి వస్తోంది. ఈ క్రమంలో శనివారం జిల్లా పరిషత్ అతిథి గృహానికి కార్యాలయాన్ని మార్చారు. కానీ అక్కడా అదే పరిస్థితి నెలకొంది. సోమవారం కురిసిన వర్షానికి లోపల గోడలు తడుస్తూ పైనుంచి వర్షపు నీరు లోపలికి వచ్చి చేరడంతో కంప్యూటర్లు, ఫైల్స్‌పై నీరు పడింది. దీంతో సిబ్బంది వాటిని పక్కన జరిపే పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్తు బోర్డు లోపలికి నీరు వెళ్లగా.. ప్లాస్టర్ సాయంతో మూసివేశారు. దీని కంటే పాత డీపీవో కార్యాలయమే బాగుందని, దానికే మరమ్మతులు చేయించి అందులోకే వెళ్తామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన తెలిపారు.

నిధులు కేటాయించాలని వినతి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఘన్‌పూర్‌లో తమ సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకపోడ్ సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సర్వే చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయినాథ్, గంగాధర్, శేఖర్, మోహన్, సాయిలు, బాలయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ఆదివాసీలు

కొనసాగుతున్న డీఎస్ స్మారక క్రీడా పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్ఏ మైదానంలో నిర్వహిస్తున్న డీఎస్ స్మారక పోటీలు మంగళవారం సైతం కొనసాగాయి. వాలీబాల్ జూనియర్ కళాశాలల (బాలికలు) విభాగంలో ప్రథమ స్థానంలో దాస్‌నగర్ ఎంజేపీటీబీఎస్, ద్వితీయ స్థానంలో సుద్దపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఉన్నత పాఠశాల బాలికల విభాగంలో ప్రథమ జడ్పీహెచ్ఎస్(మగ్గిడి), ద్వితీయ పీఎంఆర్ఐబీఎస్(బాల్కొండ), బాలుర విభాగంలో ప్రథమ పోచంపాడ్ టీజీఆర్ఎస్, ద్వితీయ నిజామాబాద్-3(చందూర్) టీజీఎంఆర్ఎస్ జట్లు నిలిచాయి. వాలీబాల్ విజేతలకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం బహుమతుల ప్రదానం ఉంటుందని సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ తెలిపారు.



విజేతలతో సొసైటీ అధ్యక్షుడు సంజయ్ తదితరులు



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ నారాయణ, సీఐ వీరయ్య, ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సూచించారు. జిల్లా కేంద్రం గిరిరాజ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ 1, 2, 3, 4 విభాగాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులకు అజాగ్రత్త వల్ల తలెత్తే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. యువకులు అతి వేగంగా వెళ్లడం సరికాదన్నారు. శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ప్రమాద దృశ్యాలను చూయించారు. పోలీసు కళాజాత బృందం నాటిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వీరయ్య, వైస్ ప్రిన్సిపల్స్ అబ్దుల్ రఫీక్, రంగారత్నం, ఏసీఈవో వినయ్‌కుమార్, పీఆర్వో దండుస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వెంకటరమణ, జి.నాగజ్యోతి, నరేశ్ కుమార్, రంజిత, సుధాకర్‌రావు, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.



మానిక్‌భవన్ పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నగరంలోని నూతన వైశ్య ఉన్నత పాఠశాల (మానిక్ భవన్) చెందిన 2001-2002కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మురళీకృష్ణ, కాంతయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, గంగాధర్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేష్, పవన్, ప్రవీణ్, పురుషోత్తం, శ్యాం, కిషోర్, సంతోష్, అర్చన, సౌజన్య, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. తీగలు సరి చేశారు..

ఈనాడు కథనానికి స్పందన

బాడ్సి(మోపాల్), న్యూస్‌టుడే: బాడ్సి ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణం వద్ద విద్యుత్తు తీగలు వాహనాలకు తాకే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయని 22న 'ఈనాడు'లో 'వేలాడుతున్న తీగలు... తీస్తాయి ప్రాణాలు' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈ రమేష్, ఏఈ బాబా శ్రీనివాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంతెనకు రెండు వైపులా ఉన్న స్తంభాలను తొలగించారు. వాటి స్థానంలో వాహనాలకు తీగలు తాకకుండా ఎత్తుగా ఉన్న కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.



తీగలను సరిచేయిస్తున్న ట్రాన్స్ ఏఈ బాబా శ్రీనివాస్

(c) eenadu

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

కోటపాటి సేవలు ఆదర్శం



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డితో నరసింహంనాయుడు

ఆర్మూర్ గ్రామీణం: రైతు, గల్ఫ్ కార్మిక నాయకుడు కోటపాటి నరసింహంనాయుడు సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. కోటపాటి పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లిలో మంగళవారం 'మెగా రక్తదాన శిబిరం' నిర్వహించారు. రైతులు, గల్ఫ్ కార్మికులకు ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. న్యాయవాది భూపతిరెడ్డి, నరేందర్, బాలయ్య, గణేష్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాధ్యక్షుడు అంజయ్య తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: రామగుండం వద్ద చేపడుతున్న థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే చేపట్టాలని శ్రీరామసాగర్ ప్రాజెక్టు జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వం తీరుపై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి జల విద్యుత్తు ఉత్పాదన కేంద్రం సీఈ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఈ పి.శ్రీనివాస్, డీఈ జె.శ్రీనివాస్, గంగారాంషిండె, రవికుమార్, శ్రీకాంత్, హేమలత, శృతిమ, సతీష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



సీఈ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

వాన వేధించకే..!

బాల్కొండ మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు, కల్లాల్లో ఆరబెట్టిన మక్కలు తడిసిపోతున్నాయి. సోమవారం అర్ధరాత్రి జోరు వాన కురవడంతో మక్కలు తడిశాయి. మంగళవారం రైతులు మళ్లీ ఆరబెట్టాల్సి వచ్చింది. మక్కలు తడిస్తే రంగు మారుతాయని నాణ్యత దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, బాల్కొండ



తడిసిన మక్కలను ఆరబెడుతున్న రైతు

కంకర పోసి.. తారు మరిచి

ఏర్గట్ల మండలం తొర్తి నుంచి మోర్తాడ్ మండలం పాలెం వెళ్లే ప్రధాన రహదారిలోని వంతెనకు ఇరువైపులా పోసిన మొరం కోతకు గురై ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఊర చెరువు అలుగు సమీపంలో గతేడాది రూ.1.45 కోట్ల నిధులతో హైలెవల్ వంతెన నిర్మించారు. ఇరువైపులా మొరం, కంకర వేసి తారు పోయాల్సి ఉండగా కేవలం మొరం వేసి వదిలేశారు. 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు స్పందించిన గుత్తేదారు రెండు నెలల కిందట కంకర, డస్టు వేసి వదిలేశారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, ఏర్గట్ల

కోనోకార్పస్‌ను నరికేశారు

ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి చౌరస్తా, మరోవైపు బృందావని థియేటర్ వైపు రోడ్డు మధ్యలోని చెట్ల కొమ్మలను బల్దియా కార్మికులు మంగళవారం నరికివేశారు. చెట్ల కొమ్మలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు, కోనోకార్పస్ చెట్లతో ఆరోగ్యానికి హానికరం అని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో చెట్ల కొమ్మలను కత్తిరించామని పుర కమిషనర్ రాజు వెల్లడించారు.



– న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 **మన్యంధీరుడు:** 1.25, **చిక్లెట్స్:** 4.05, **పైలం పిలగా..:** 6.45, **హైడ్ ఎన్ సీక్:** 9.30

స్క్రీన్ 3 **మత్తు వదలరా 2:** 12.15, 3.15, 6.15, 9.15

స్క్రీన్ 4 **సరిపోదా శనివారం :** 11.30, 3.05, 6.40

గొర్రె పురాణం: 4.15, **బొమ్మరిల్లు:** 10.15

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూర్ మండలం దేగాంలో సీసీ రోడ్లు గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. వీధి దీపాలు లేకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురవుతున్నాం. **- రాజు, దేగాం**

పరిష్కారం: గ్రామంలో సీసీ రోడ్డుపై గుంతలు పూడ్చి వేశాం. ఇంకా ఎక్కడైనా ఉంటే పూడ్చి వేసి బాగుచేయిస్తాం. వీధి దీపాలు పరిశీలించి అవసరమైన చోట ఏర్పాటు చేస్తాం. **- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి (దేగాం)**

వర్షపు నీరు తొలగించారు

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: జాగిర్యాల్ గ్రామంలో వర్షపు నీరు నిలిచిందని స్థానికులు సోమవారం 'మేమున్నాం... మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి అర్చన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి మంగళవారం సిబ్బందితో నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.



జాగిర్యాల్ గ్రామంలో..

ప్రోత్సాహకం అందదేమి?

విడుదల కాని ఎన్‌క్యూఏఎస్ పథకం నిధులు

– న్యూస్‌టుడే, ఆర్మూర్

ప్రభుత్వ దవాఖానాలంటే వసతులుండవు.. సరిగా పట్టించుకోరు.. అనే రోజులు పోయాయి. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానా'కు అనే నానుడిని అబద్ధం చేశాయి ఆ ఆసుపత్రులు. వైద్యులు, సిబ్బంది పడిన కష్టానికి ఫలితం లభించింది. సౌకర్యాలు మెరుగుపడ్డాయి. మంచి సేవలు అందుతున్నాయి. రికార్డుల నిర్వహణలో ఉన్నతంగా నిలిచి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ క్వాలిటీ అస్సురెన్స్ స్టాండర్డ్స్ పురస్కారాన్ని అందుకున్నాయి. కానీ ఈ పథకం కింద రావాల్సిన ప్రోత్సాహక నిధులు రెండేళ్లుగా విడుదల కావడం లేదు. సర్కారు ప్రోత్సాహకం అందిస్తే దవాఖానాలకు మరింత ప్రయోజనం చేకూరనుంది.



నందిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఏయే ఆరోగ్య కేంద్రాలంటే..

ఎన్‌క్యూఏఎస్ పథకం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో మూడేళ్ల పాటు ఏటా రూ.3 లక్షలు, సీహెచ్‌సీలకు రూ.2 లక్షలు అందుతాయి. ఈ పథకం ప్రారంభంలో కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి పీహెచ్‌సీలకు మూడేళ్ల పాటు నిధులిచ్చారు. మళ్లీ ఇప్పుడు ఎంపికై రెండేళ్లవుతున్నా నిధుల జాడ లేదు. ఆర్మూర్ డివిజన్‌వ్యాప్తంగా 2022లో కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, వేల్పూర్, 2023లో మెండోరా, నందిపేట్, దేగాం, కిసాన్‌నగర్, పోచంపాడ్ పీహెచ్‌సీలు ఎంపికయ్యాయి.

ఆర్మూర్ డివిజన్‌లో ఎంపికైన ఆరోగ్యకేంద్రాలు

●●	★★	▼▼
కమ్మర్‌పల్లి	88.6	07.04.2022
చౌట్‌పల్లి	90.8	11.04.2022
వేల్పూర్	72.0	14.10.2022
మెండోరా	86.8	02.02.2023
నందిపేట్	79.9	31.03.2023
దేగాం	94.8	17.05.2023
కిసాన్‌నగర్	78.9	22.08.2023
పోచంపాడ్	84.0	18.08.2023

●● పీహెచ్‌సీ ★★ కేటాయించిన స్కోర్ ▼▼ సర్టిఫికేట్ తేదీ

వడపోసి.. మార్కులేసి..

ఆసుపత్రిని సుందరంగా తీర్చిదిద్ది రోగులకు సకల సౌకర్యాలతో సేవలందించడంలో ఈ దవాఖానాలు ప్రత్యేకతను చాటుకున్నాయి. ప్రత్యేక తనిఖీ బృందాలు అంశాల వారీగా పరిశీలిస్తాయి. పరిశుభ్రంగా లేకున్నా, రోగులకు సేవలందే విషయంలో నిర్లక్ష్యం చేసినా, సుమారు 17 రకాల రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయకపోయినా పక్కన పెడతారు. తాము పనిచేసే ఆసుపత్రికి రూ.లక్షల ప్రోత్సాహకం వస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చనే తలంపుతో స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది మంచి మార్కులు పొందేందుకు అహర్నిషలు కష్టపడతారు. చేసిన పనికి ఫలితం దక్కిందనే సంతోషంతో తొలగి నిధులు విడుదల కాకపోవడంతో నిరుత్సాహ పడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టి నిధులు విడుదలయ్యేలా పర్యవేక్షిస్తే మరిన్ని ఆసుపత్రులు ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు కృషి చేస్తాయి. ఎంపికైన పీహెచ్‌సీ, సీహెచ్‌సీలు మరింత ఉత్తమ సేవలందించేందుకు దోహదపడుతుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఎన్‌క్యూఏఎస్ పథకం కింద డివిజన్‌లో 8 పీహెచ్‌సీలు ఎంపికయ్యాయి. వీటికి పథకం కింద నిధులు రావాల్సి ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. డివిజన్ పరిధిలోని 15 పీహెచ్‌సీలు ఈసారి ఈ పథకం కింద పోటీ పడేందుకు సిద్ధమయ్యాయి. రోగులకు సరైన సేవలందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డా.రమేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

వన్నెల్(బి)(బాల్కొండ), న్యూస్‌టుడే: పసుపును సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని రైతు ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ నాగులపల్లి రాజేశ్వర్ అన్నారు. వన్నెల్(బి) రైతు వేదికలో సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. బెడ్డు పద్ధతిలో సాగు చేస్తే పంటకు రోగాలు తక్కువ వస్తాయన్నారు. స్పైస్ బోర్డు డైరెక్టర్ సుందరేసన్ మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు పసుపు ఉడకబెట్టే, పాలిషింగ్ యంత్రాలు 90శాతం రాయితీపై ఇస్తామన్నారు. రాయితీ పై టార్పాలిన్లు అందజేస్తామని తెలిపారు. మండల వ్యవసాయాధికారిణి లావణ్య మాట్లాడుతూ.. పంటలకు తెగుళ్లు వస్తే నివారణకు తమను సంప్రదించాలన్నారు. ఏ తెగులుకు ఏ మందులు పిచికారీ చేయాలో సూచనలిస్తామన్నారు. స్పైస్‌బోర్డు ఫీల్డ్ అసిస్టెంట్ రాజమాణిక్యం, జూనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ మాధవ్, ఏఈవో నిహారిక, వైస్ ఛైర్మన్ తోట చిన్నయ్య, డైరెక్టర్లు నర్సయ్య, రాజేశ్వర్, గణేష్, సీఈవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ నాగులపల్లి రాజేశ్వర్

తరలొచ్చి.. ఆందోళన చేపట్టి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ మండలంలోని సుర్భిర్యాల్ మాజీ సర్పంచి సవిత, ఆమె భర్త గణేశ్ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థులు ఆరోపించారు. మంగళవారం పెద్ద ఎత్తున ఆర్మూర్ ఠాణాకు తరలివచ్చి బైఠాయించారు. మాజీ సర్పంచి భర్త ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలను చేపట్టారని సర్వజన సంఘం సభ్యులు ఆరోపించారు. వారిపై మాజీ సర్పంచి భర్త గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామస్థులు మంగళవారం ఆర్మూర్ ఠాణాకు గణేశ్‌పై తరలివచ్చి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ బస్వారెడ్డి ఠాణాకు చేరుకొని గ్రామస్థులను సముదాయించారు. వీడీసీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. జరిమానాలు, గ్రామ, కుల బహిష్కరణ చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ రవికుమార్ ఉన్నారు.



ఆర్మూర్ ఠాణా ఎదుట బైఠాయించిన ప్రజలు

సామాజిక సేవ అలవర్చుకోవాలి



నందిపేట్‌లో మొక్కలు నాటుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

నందిపేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుకునే సమయం నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలని నందిపేట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ సూచించారు. కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అధ్యాపకులు లక్ష్మణ్ శాస్త్రి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విధిగా పాల్గొనాలని జిల్లా ఎన్ఎస్ఎస్ ఛైర్మన్ చిన్నయ్య సూచించారు. నందిపేట్ మండలంలోని అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డి.వెంకటేశం, కె.శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ఛైర్మన్ చిన్నయ్య

మోర్తాడ్(కమ్మర్‌పల్లి): మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిర్వహించే సేవలు అభినందనీయని ప్రిన్సిపల్ పెద్దన్న పేర్కొన్నారు.



మోర్తాడ్‌లో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ పెద్దన్న

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి రితిక జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభతో జాతీయస్థాయికి ఎంపికై ఈనెల 26 నుంచి హరియాణాలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని పీఈటీ సింధూజ పేర్కొన్నారు.



రితిక

క్రీడ

భీమ్‌గల్, న్యూస్‌టుడే: భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రవస్తి, ఆనందిత జాతీయస్థాయి టెన్నికాయిట్ క్రీడలకు ఎంపికైనట్లు పీడీ ఈర్ల భూపతి తెలిపారు. విద్యార్థులను వీడీసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు కృష్ణస్వామి, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిగౌడ్, మల్లేష్‌గౌడ్‌లు సన్మానించారు. బాలరాజు, సాయిబాబా, గంగాధర్, మహేష్, కిషన్, రాజేందర్ పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

క్రీడాకారులకు సత్కారం

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లి చెందిన పెంట కిషన్, ఉప్లూర్‌కు చెందిన ఏలేటి మోహన్‌రెడ్డి మంచిర్యాలలో నిర్వహించిన ఉత్తర తెలంగాణస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. టోర్నీలో రెండో స్థానంలో నిలిచిన వీరిని మినీజూబ్లీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో రాజశేఖర్, బాల్‌రెడ్డి, నరేష్, రవీందర్, పాషా తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..

ఆర్మూర్ గ్రామీణం: ఇటీవల జరిగిన ఆర్మూర్ అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో పట్టణంలోని మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ముఖ్యఅతిథి కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ బాధ్యుడు వినయ్‌రెడ్డి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌ను సన్మానించి అభినందించారు. నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మున్నా, కౌన్సిలర్ రాము, నాయకుడు కాశీరాం, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, వీడీసీ సభ్యులు రవి, లక్ష్మణ్, రాజన్న, శ్రీనివాస్, సాజిద్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ గ్రామీణం: ఆలూర్ మండలం మిర్ధాపల్లిలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన ఆలూర్ మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడల్లో ఆలూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్ గట్టడి రాజేష్‌ను ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. మాజీ సర్పంచి కల్లెం మోహన్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు విద్యార్థులను అభినందించారు.



మిర్ధాపల్లిలో విజేతలతో ఉపాధ్యాయులు

జగన్ దిష్టిబొమ్మ దహనం



బుస్సాపూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

బుస్సాపూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం కల్తీ ఘటన భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని మెండోరా మండలం బుస్సాపూర్‌లో హిందూ వాహిణి ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమాచార హక్కు చట్టంపై మంగళవారం జిల్లా కన్వీనర్, న్యాయవాది ఆనంద్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు కావాల్సిన సమాచారం తెలుసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాగలత, వైస్‌ప్రిన్సిపల్ స్పందన, లక్ష్మి, భువన, స్వర్ణలత, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు మంజూరు చేయించాలని వినతి



బోధన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కంఠం రైతులు

నందిపేట్ గ్రామీణం, న్యూస్‌టుడే: పంట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని.. రహదారుల మంజూరు నిధులు కేటాయించాలని మండలంలోని కంఠం గ్రామానికి చెందిన రైతులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, సుమన్ తదితరులు ఉన్నారు.

పేద కుటుంబానికి చేయూత

వేల్పూర్(కమ్మర్‌పల్లి): పచ్చలనడ్కుడకు చెందిన మహేష్ అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి పంపించారు. నగదును మహేష్ కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందించారు.

వైద్య శిబిరం

బాల్కొండ: కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ బాల్కొండ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్‌కు చెందిన దంత వైద్యుడు నిహార్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జ్ఞానసాగర్‌రెడ్డి, దినేష్‌బాయ్ పటేల్, లింగం, జీవన్, ప్రసాద్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై దాడి

నందిపేట్, న్యూస్‌టుడే: డొంకేశ్వర్ మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు జూద స్థావరంపై దాడి చేశారు. ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. జూదం ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.14800 నగదు, ఆరు చరవాణులు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

బాల్కొండ: పోచంపాడ్ కూడలిలోని బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, టీఎన్‌వీఎస్ నాయకులు వెంకటేష్, రవికుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల వద్ద విద్యార్థిని కలిసి మాట్లాడారు. చితకబాదిన ఉపాధ్యాయుడు, పట్టించుకోని ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తితో శ్రీరామసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లిన మహిళను సోమవారం రాత్రి మెండోరా ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రాజెక్టు ఉద్యోగులు రక్షించారు. మోస్రా మండలానికి చెందిన వివాహిత డ్యామ్‌లో దూకడానికి ప్రయత్నిస్తుండగా.. విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు గమనించి ఆరా తీశారు. ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని చెప్పడంతో మెండోరా ఎస్సై నారాయణ సముదాయించి కుటుంబీకులకు అప్పగించారు.

ద్విచక్రవాహనం చోరీ

మోర్తాడ్(కమ్మర్‌పల్లి): మోర్తాడ్‌కు చెందిన ప్రదీప్ ద్విచక్రవాహనాన్ని సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం కేసు నమోదుచేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

గంగాసముందర్‌లో పిడుగుపాటు

నందిపేట్: గంగాసముందర్‌లో పిడుగుపడి మంగళవారం అచ్చకారి చిన్న బోజారెడ్డి ఇంటి పైకప్పు, లోపలి వస్తువులు ధ్వంసమయ్యాయి. రాత్రి సమయంలో పిడుగుపాటుకు విద్యుత్తు మీటరు, ఫ్రిజ్, టీవీ కాలిపోయాయి.

మానాల మోహన్‌రెడ్డికి సన్మానం



బాల్కొండ, న్యూస్‌టుడే: వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన ఇమ్రాన్‌ఖాన్ నిజామాబాద్‌లో రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని మంగళవారం కలిసి సన్మానించారు. తనకు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ప్రవీణ్‌గౌడ్, ప్రవీణ్, అర్వింద్, ప్రశాంత్, తేజ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ మండలం వన్నెల్(బి)లో జరిగిన కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియామకమైన ముత్యంరెడ్డిని, డైరెక్టర్‌గా నియామకమైన రాజేష్‌ను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, రాజు, కిషన్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు

వేల్పూర్(కమ్మర్‌పల్లి): వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యంరెడ్డిని లక్కోరా గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. సొసైటీ వైస్ ఛైర్మన్ శ్రీధర్, చేపూర్ గంగాధర్, హన్మాండ్లు, ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ శుభాకాంక్షలు

వృత్తినే దైవంగా భావించి ఎందరో విద్యార్థిని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది నేడు పదవీ విరమణ ఆత్మీయ సమావేశం జరుపుకుంటున్న శ్రీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి గారికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు..

శ్రీమతి&శ్రీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి-వీణరెడ్డి
LFL HM
ప్రాథమిక పాఠశాల, నవనాథపురం, ఆర్మూర్

రాజ గంగారాం M.E.O. ఆర్మూర్	సదాశివ్ LFL HM, MPPS K.N.C ఆర్మూర్	కె. మల్లయ్య LFL HM, MPPS కోమన్‌పల్లి, ఆర్మూర్
వి. హరిప్రసాద్ LFL HM, MPPS కుకునూర్, వేల్పూర్	బి. సూరత్ రామ్ SGT, MPPS ముబారక్‌నగర్, NZB రూరల్	ఎ. విజయ SGT, MPPS నవనాథపురం, ఆర్మూర్
కె. జయంతి SGT, MPPS కల్లూర్, NZB రూరల్	జె. అనురాధ SGT, MPPS నవనాథపురం, ఆర్మూర్	కె. తులసి SGT, MPPS నవనాథపురం, ఆర్మూర్
బి. జ్యోతి SGT, MPPS K.N.C. ఆర్మూర్	ప్రాథమిక పాఠశాల-నవనాథపురం మరియు మిత్రబృందం	

(c) eenadu